## క్లుప్తంగా

### అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన ఉమామహేశ్వర కళా క్షేత్రంకు చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శుక్రవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై కందికట్టు వాసుదేవరావు శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని రాజగోపురం వద్దకు విచ్చేసిన భక్తులు కళావేదికపై జరుగుతున్న నృత్య ప్రదర్శనను ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం నృత్య ప్రదర్శన ఇచ్చిన కళాకారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందచేశారు.

### హోంగార్డ్ వైద్యానికి దీవెన ఫౌండేషన్ ఆర్థిక సహాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ):నగరంలోని సూర్యారావు పేట పోలీస్ స్టేషన్‌లో హోమ్ గార్డ్ (హెచ్‌జీ 670)గా పని చేస్తున్న దాసుకు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. దీంతో ఆయన ఆంధ్రా హాస్పటల్‌లో చేరటంతో వైద్యులు శుక్రవారం హార్ట్ సర్జరీ చేశారు. బాధితుడి కుటుంబ సభ్యులు సహాయం కోసం దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు, హెడ్ కానిస్టేబుల్ జాజుల నాగరాజు హాస్పటల్‌కు వెళ్లి దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరుపున రూ.10 వేలు దాసు కుటుంబ భ్యలకు అందజేశారు. ఆపదలో ఉన్న పేదవారికి సహాయం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులకు దాసు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియ చేశారు. హెడ్ కానిస్టేబుల్ నాగరాజు మాట్లాడుతూ పేదవారి విద్య, వైద్యం ఖర్చుల నిమిత్తం తమ వంతు సాయం చేయడమే ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు సహకరిస్తున్న సిటీ పోలీసులకు ధన్యవాదాలు తెలియచేశారు.

### రవికుమార్ సాహిత్య సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: తల్లాప్రగడ రవికుమార్ సాహిత్య సేవలు వెలకట్టలేనివని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. రవికుమార్ మిత్రబృందం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కవి, రచయిత పరిశోధకుడు తల్లాపగడ రవికుమార్ సంస్మరణ సభను గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రవికుమార్ సామాజిక స్పృహ కలిగిన రచయిత అని చెప్పారు. కృష్ణా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు మాట్లాడుతూ రవి కుమార్ అనేక రేడియో కార్యక్రమాల్లో పాల్గొన్నాడని గుర్తుచేశారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి మాట్లాడుతూ రవికుమార్ అనేకమంది రచయితలకు ప్రోత్సాహం అందించినట్లు తెలిపారు. రవికుమార్ కుటుంబ సభ్యులు శశిధర్, తల్లాప్రగడ శైలేష్ వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, చలపాక ప్రకాష్, జానపద గాయకుడు దామోదర గణపతిరావు, సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్ శర్మ, డాక్టర్ యశో పూర్ణచంద్రరావు, కళాసాగర్, డాక్టర్ వెన్నా వల్లభరావు, గోళ్ళ నారాయణరావు ఆయనతో అనుబంధం గుర్తుచేసుకున్నారు. రవికుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

### నలంద ఎన్‌సీసీ క్యాడెట్‌కు డీజీ అప్రిసియేషన్ అవార్డు



లబ్బీపేట(విజయవాడతూర్పు):నలంద డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ 4 ఆంధ్రా బాలికల బెటాలియన్ క్యాడెట్ బుగత సంధ్యకు డిజి అప్రిసియేషన్ అవార్డు లభించింది. ఇటీవల సికింద్రాబాద్‌లోని ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీడీజీ సికింద్రాబాద్ డైరెక్టరేట్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి, డీజీ లెఫ్టినెంట్ కల్నల్ గుర్బీర్పల్ సింగ్ చేతుల మీదగా సంధ్య అవార్డును అందుకుంది. ఏటా ఎన్‌సీసీలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ఈ అవార్డును అందచేస్తామని, ఇటీవల ఆగ్రాలో జరిగిన పారాజంప్ కోర్సులో ఏపీ, తెలంగాణ నుంచి ముగ్గురు హాజరు కాగా, వారిలో తమ విద్యార్థి సంధ్య అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో అవార్డుకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు శుక్రవారం అభినందనలు తెలిపారు.

# మండుటెండలో పండుటాకుల పడిగాపులు!

- రెండో రోజూ తప్పని తిప్పలు
- బ్యాంకుల వద్ద బారులు తీరిన వృద్ధులు
- ఎండలో అల్లాడుతున్నామంటూ ఆవేదన
- చంద్రబాబుతోనే ఈ కష్టాలంటున్న వృద్ధులు



బ్యాంక్ తలుపులు వేసేయటంతో బయట గుమికూడిన వృద్ధులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పింఛన్ల కోసం పండుటాకులు రెండో రోజూ పడిగాపులు కాయాల్సి వచ్చింది. భగ్గుమంటున్న ఎండలో వృద్ధులు, వికలాంగులు నరకయాతన అనుభవించారు. నగరంలోని బ్యాంకులన్నిటి వద్ద వృద్ధులు బారులు తీరి కనిపించారు. చంద్రబాబు నిర్వాకంతోనే తాము ఇన్ని ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వలంటీర్ల సేవలకు చంద్రబాబు అండ్ బ్యాచ్ కల్పించిన అడ్డంకులతో ఈ నెలలో రెండో రోజున సైతం లబ్ధిదారులకు తిప్పలు తప్ప లేదు. ఇప్పటివరకు ఇంటి చెంతనే పింఛను అందుకున్న లబ్ధిదారులు గత నెలలో సచివాలయాల వద్ద క్యూ కడితే ఈ నెల బ్యాంకుల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఐదేళ్లుగా ప్రతినెలా మొదటి తేదీ వేకువజామునే లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి సాయం అందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. వలంటీర్ల సేవలకు జడిసిన చంద్రబాబు తన అనుకూల వర్గం ద్వారా ఈసీకి ఫిర్యాదులు చేయించారు. వలంటీర్లపై ఈసీ ఆంక్షల నేపథ్యంలో పెన్షన్ల పంపిణీతో వృద్ధులు అవస్థలు పడుతున్నారు.

**పశ్చిమంలో 21,400 మంది...**

పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి నెల 21,400 మంది లబ్ధిదారులకు ప్రతినెలా ప్రభుత్వం పింఛన్లు అందజేస్తుంది. గత నెలలో లబ్ధిదారులు సచివాలయాల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ములు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అరకొర మంది నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లకు వెళ్లి అధికారులు అందజేయగా అధిక శాతం మంది సచివాలయాలకు వెళ్లాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా మరోమారు పచ్చ బ్యాచ్ ఫిర్యాదుతో అకౌంట్లు ఉన్న లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ములు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమచేయాలని, లేనివారికి ఇళ్లకు వెళ్లి అందజేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. సచివాలయ ఉద్యోగులు తొలి రోజే అధిక శాతం మంది లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. ఇదిలా ఉండగా మండుటెండలో బ్యాంకుల వద్దకు వెళ్లి నగదు తీసుకునేందుకు ఆయా డివిజన్లలోని దివ్యాంగులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కుటుంబసభ్యులను వెంటపెట్టుకుని ఆటోల్లో వెళ్లి పెన్షన్ తెచ్చుకోవాల్సి వచ్చిందని పలువురు వాపోయారు. రెండు నెలల క్రితం వరకు వలంటీర్లు వేకువజామునే ఇంటికి వచ్చి చేతి కందించే వారని, చంద్రబాబు అధికారంలోకి రాకుండానే తమను ముప్పతిప్పలు పెడుతున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంకుల వద్దకు పోటెత్తటంతో బ్యాంకుల సిబ్బంది గేట్లు వేసేస్తున్నారు. గేటు బయట వారి తిప్పలు వర్ణణాతీతంగా ఉన్నాయి. అలాగే ఈసేవా కేంద్రాల్లోని బ్యాంకుల నుంచి గుర్తింపు పొందినవారు కమిషన్ తీసుకొని వృద్ధులకు పెన్షన్ మొత్తాన్ని అందిస్తున్నారు.



బ్యాంకు బయట ఎండకు కూలబడిన వృద్ధులు

**మా కష్టాలన్నీ చంద్రబాబు వల్లే**



పింఛన్ తీసుకునేందుకు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రతి నెలా ఒకటో తారీఖున జగన్ బాబు పంపిన వలంటీర్లు మాకు ఇంటి వద్దనే పింఛను ఇచ్చేవారు. ఇంతటి మండుటెండల్లో మమ్మల్ని ఇలా తిప్పడం వల్ల చంద్రబాబుకు ఏమొస్తుందో అర్థం కావడం లేదు.

– మజ్జి చిలకమ్మ, వన్‌టౌన్

**బ్యాంకులో తిప్పలు**



బ్యాంకులో క్లోజ్ చేసిన పాత అకౌంట్‌కు పింఛన్ సొమ్ములు జమయ్యాయి. నగదు తెచ్చు కునేందుకు బ్యాంకుకు వెళితే పాత అకౌంట్‌లో పడ్డాయని, మళ్లీ అకౌంట్ తెరిచేందుకు ఫొటోలు తెచ్చుకోమని తిప్పి పంపారు. మళ్లీ బ్యాంకుకు వెళ్లి తిప్పలు పడాల్సిందే.

– ముత్తిరెడ్డి గంగమ్మ, ఆంజనేయవాగు

# బాబు అధికారంలోకి వస్తే ప్రజలకు కష్టాలే



యువకుడితో మాట్లాడుతున్న ఆసిఫ్



ఓటు వేయాలని మహిళను కోరుతున్న ఆసిఫ్

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్
- 52వ డివిజన్ కొండ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం



ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని వృద్ధురాలిని కోరుతున్న ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రజలకు కష్టాలు, కన్నీళ్లు తప్పవని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ అసిఫ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా 52వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి తంగెళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో కొండ ప్రాంతంలో షేక్ అసిఫ్ ప్రతి గడపకు వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, డివిజన్‌లో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. పింఛనుదారులను పలకరించి నగదు వచ్చినది లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కొండ ప్రాంతమంతా పర్యటించి రానున్న ఎన్నికల్లో జగనన్నను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ అవ్వాతాతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల ఉసురు తప్పకుండా టీడీపీ, బీజేపీ, జనసేనకు తగులుతుందన్నారు. కూటమి నేతలు దమ్ముంటే పింఛను కోసం బ్యాంకుల వద్ద మండుటెండలో పడిగాపులు పడుతున్న వృద్ధుల వద్దకు వెళ్లి ఓట్లు అడగాలన్నారు. జగనన్న అధికారంలో లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఇప్పటికే ప్రతి ఒక్కరికీ తెలిసిందన్నారు. గత ఐదేళ్లుగా తాము ఎలా ఆత్మ గౌరవంతో జీవనం సాగించామో అర్థం అవుతోందని వృద్ధులు చెబుతున్నారని వివరించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే మళ్లీ తమకు కష్టాలు, కన్నీళ్లు తప్పవని పింఛనుదారులతో పాటు ప్రజలందరికీ స్పష్టంగా కళ్లముందు కనిపిస్తుందని పేర్కొన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ అంటూ ఊదరగొడుతున్న మ్యానిఫెస్టోను ప్రజలు నమ్మడం లేదన్నారు. టీడీపీ, జనసేన మ్యానిఫెస్టో కాపీలు చెత్త కుప్పల్లోకి చేరుతున్నాయని చెప్పారు. ఎన్నికల తరువాత చంద్రబాబు ఆయన శిష్యుడు సుజనాచౌదరి హైదరాబాద్‌లోని తమ ఇళ్లకు వెళ్లటం ఖాయమన్నారు. వీళ్లు ఎవరూ పోలింగ్ ముగిసిన తర్వాత పశ్చిమ నియోజకవర్గంలో కనిపించరన్నారు. ఎన్నికల ముందు తాము ఇక్కడే ఉన్నాం.. ఎన్నికల తర్వాత కూడా ఇక్కడే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ యలకల చలపతిరావు, నాయకులు టి. చంద్రశేఖర్‌రెడ్డి, గురుమహంతు మహేష్, నగరాల రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జి, నాయకులు ఎం.రామకృష్ణ, విశ్వనాథ రవి, బంకా శ్రీను, దుక్కా వేణు, సంకాబత్తుల అశోక్, కర్రి గౌరి, బెవర సురేష్, కోయ దుర్గారావు, అయితా కిషోర్, బైపిళ్ల రమేష్, బంకా తేజ, వానపల్లి త్రిమూర్తులు, రాజగిరి సురేష్, వై.మాణిక్యం, ఎస్.రాజశేఖర్, వేల్పూరి నీలిమ, ఎస్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# సుజనా, చిన్ని ఇద్దరూ ఆర్థిక నేరగాళ్లే



కేశినేని నాని, ఆసిఫ్, మేయర్లను సత్కరిస్తున్న ముస్లింలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ లోక్‌సభకు పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని, పశ్చిమ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి ఇద్దరూ ఆర్థిక నేరగాళ్లేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి కేశినేని నాని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర నేత అబ్దుల్ వహాబ్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని మాడపాటి క్లబ్ ఆవరణలో ముస్లింల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ బీజేపీకి కొమ్ముకాస్తున్న ద్రోహులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. తాను పార్లమెంట్‌లో ముస్లిం మైనార్టీలకు మద్దతుగా ఉన్నానని తెలిపారు. ఎప్పుడూ వారికి వ్యతిరేకంగా తాను వ్యవహరించలేదన్నారు. ముస్లిం మైనార్టీలకు గడిచిన పదేళ్ల కాలంలో తాను అండగా ఉన్నానని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పని చేసిన మైనార్టీ నేత నేడు బీజేపీకి ఓటు వేయాలని కోరటం సిగ్గుచేటని షేక్ ఆసిఫ్ అన్నారు. చిల్లర కోసం ఆశపడి ముస్లిం మైనార్టీల భవితను బీజేపీకి తాకట్టు పెట్టే ఈ విధమైన చర్యలకు పాల్పడుతున్న ముస్లిం నేతలు నిజమైన ద్రోహులని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నాయకుడు పోతిన మహేష్, 54వ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ ఆర్షద్ అధ్యక్షత వహించగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి జీఎంసీ బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌసమొహిద్దీన్, షేక్ బాషి, కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికవర్గానికి అండగా జగనన్న

వస్త్రలత ముఠా కార్మికులతో ఆసిఫ్, కేశినేని శ్వేత



కార్మికులకు అభివాదం చేస్తున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):రాష్ట్రంలో కార్మికవర్గానికి అండగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అసిఫ్ అన్నారు. 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి చటర్జీ ఆధ్వర్యంలో స్థానిక వస్త్రలత ప్రాంగణంలోని ముఠా కార్మికుల కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. షేక్ ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎంపీ కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకి కార్మికులే వెన్నెముక అని తెలిపారు. కార్మికుల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. బడుగు బలహీన వర్గాల ఉన్నతికి సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే తీసుకొచ్చిన ఘనత జగన్‌దేనన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతుగా ఉండాలని కోరారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ స్థానికుడు, ప్రజల సమస్యలు తెలిసిన ఆసిఫ్‌ను ఎన్నుకోవాలని కోరారు. సుజనాచౌదరి ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ పోటీ చేస్తున్నారని గుర్తు చేశారు. కేశినేని శ్వేత మాట్లాడుతూ మీ అందరి మద్దతుతో ఎన్నికల్లో గెలిచి ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, ప్రతి సమస్యకు తనదైన పరిష్కారం చూపే షేక్ ఆసిఫ్, కేశినేని నానిలను గెలపించాలని కోరారు. ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, యలకల చలపతిరావు, పార్టీ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు విశ్వనాథ రవి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు నగరాలు మద్దతు



ఆసిఫ్‌ను సత్కరిస్తున్న బాయన బాబ్జీ ఇతర నగరాల కులస్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నగరాలంతా మద్దతుగా నిలబడాలని ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాయన బాబూజీ(బాబ్జి) పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరాల సీతారామ స్వామి మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం గుర్తించని వెనుకబడిన నగరాల సామాజికవర్గాన్ని గుర్తించి, బీసీ హోదా కల్పించిన ఘనత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిదేన్నారు. ప్రస్తుత జగన్ పాలనలో నగరాలకు పెద్దపీట వేసి అనేక కీలక పదవులు అందించారని చెప్పారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం చైర్మన్ పదవిని, నగర మేయర్ పదవులు అందించారని తెలిపారు. అలాగే నగరాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. శ్రీశైలం ధర్మకర్తల మండలిలో ధర్మకర్తగా తమ సంఘీయుడిని కేటాయించారని చెప్పారు. శ్రీశైలంలో నగరాల అన్న సత్రం నిర్మాణానికి 50 సెంట్ల స్థలం, మధురవాడలో మరో 50 సెంట్ల స్థలం కేటాయించారని వెల్లడించారు. నాలుగు జిల్లాలకే పరిమితమైన బీసీ హోదాను రాష్ట్రం మొత్తం వర్తింపజేసి నగరాల కులానికి ఎంతో మేలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో విజయవాడలో వైఎస్సార్ సీపీ తరుపున పోటీ చేస్తున్న కేశినేని నాని, షేక్ ఆసిఫ్, వెలంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్‌లకు నగరాల కులస్తులందరూ తమ ఓటును వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. శ్రీశైలం దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు గురుమహంతు మహేష్, దుర్గా కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ కొరగంజి భాను, మాజీ బ్యాంక్ డైరెక్టర్ బంక శ్రీను పార్టీ నాయకులు బైపిళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### సహాయ మాత ఆలయ స్వర్ణోత్సవాలు ప్రారంభం



మైలవరం: మేరీమాత మధ్యస్థ ప్రార్థన సహాయం విశ్వాసులపై ఎల్లవేళలా ఉంటుందని అతిథి గురువు, విజయవాడ రేడియో మరియమాత డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ బి. జాన్‌పీటర్ అన్నారు. మైలవరం శాంతినగర్‌లోని క్రైస్తవ సహాయమాత దేవాలయం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం చర్చి ప్రాంగణంలో స్వర్ణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థన కూటమిలో ఫాదర్ జాన్ పీటర్ మాట్లాడుతూ పరిశుద్ధ కన్య మరియ మాత వర ప్రసాదమాతగా వెలిశారని, అవసరంలో ఉండి ప్రార్థించిన విశ్వాసులకు వారి అవసరాలు తీరుస్తున్నారని చెప్పారు. విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ ప్రసంగించారు. భీమవరప్పాడు, కోడూరు, చిన నందిగామ, గణపవరం, చంద్రాల, వెల్వడం, కుంటముక్కల, చెవుటూరు గ్రామాల నుంచి విశ్వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ సిస్టర్స్, ఉపాధ్యాయ ఉపదేశకులు, స్వర్ణోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బాబు హామీలను మోదీ సైతం నమ్మటం లేదు

- మతోన్మాదులను పశ్చిమ ప్రజలు తరిమికొడతారు
- 53వ డివిజన్‌లో విస్తృత ప్రచారం చేపట్టిన షేక్ ఆసిఫ్



కొబ్బరిబొండాలను కొడుతున్న ఆసిఫ్



వృద్ధురాలిని ఆత్మీయంగా పలకరిస్తున్న ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో విడుదల చేసిన హామీలను మోదీ సైతం నమ్మటం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. అందువలనే మ్యానిఫెస్టోలో మోదీ బొమ్మగానీ, బీజేపీ గుర్తు గాని లేదని తెలిపారు. 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. రాయల్ హోటల్ సెంటర్ నుంచి ప్రారంభమైన ప్రచారం గులాం మొహిద్దీన్ వీధి, కోమలవిలాస్ సెంటర్, కేటీరోడ్డు, గణపతిరావురోడ్డు తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగింది. ఈ సందర్భంగా మీడియాతో ఆసిఫ్ మాట్లాడుతూ చంద్రబాబు ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన సూపర్‌సిక్స్ మేనిఫెస్టోను ఆ పార్టీ నాయకులు సైతం నమ్మటం లేదన్నారు.

2014 ఎన్నికల్లో చేసిన 600 వాగ్దానాలు లాగానే ఈ సూపర్ సిక్స్ కూడా అని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. సుజనాచౌదరి బ్యాంకులను మోసం చేసి ఇక్కడి ప్రజలకు మేలు చేస్తానని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. సుజనాచౌదరి, అతని గురువు చంద్రబాబు ఇద్దరూ మోసగాళ్లేనని దుయ్యబట్టారు. ఇద్దరూ బ్యాంకులను, ప్రజలను నిరంతరం మోసగిస్తునే ఉన్నారని ధ్వజమెత్తారు. వీరిద్దరినీ ప్రజలు తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా సమాజంలో మతం పేరుతో విద్వేషాలను సృష్టించాలని ప్రయత్నించే దుష్ట శక్తులను ప్రజలు ఆమోదించరని స్పష్టం చేశారు. వారికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని వివరించారు. రానున్న ఎన్నిల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్లు యలకల చలపతిరావు నాయకులు చాన్, కూరాకుల నాగ, మజ్జి శ్రీనివాసరావు, కట్టా సత్తెయ్య, శబాషి తదితరులు పాల్గొన్నారు.

### 160 మద్యం సీసాలు స్వాధీనం



నందిగామ: తెలంగాణ రాష్ట్రం మధిర ప్రాంతం నుంచి బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 160 సీసాల మద్యాన్ని గురువారం అర్ధరాత్రి నందిగామ పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. ఈమేరకు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా నందిగామ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ మాట్లాడుతూ అక్రమ మద్యం తరలించడానికి ఎన్ని ఎత్తులు వేసినా పట్టుబడక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ హనీష్, ఎస్సై దుర్గామహేశ్వర రావు పాల్గొన్నారు.

### అధికారులు పారదర్శక సేవలు అందించాలి

గాంధీనగర్: ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రంలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పారదర్శకంగా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. పోస్టల్ ఓటింగ్‌కు అర్హులైన వారు శనివారం నుంచి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. కేంద్రీకృత ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రంలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. కేంద్రంలో విధులు నిర్వర్తించే పోలింగ్ ఆఫీసర్లకు నిర్దేశించిన విధులపై అవగాహన కల్పించారు. వివరాల పరిశీలన, అనుబంధం–5లో సంతకం తీసుకోవడం, చేతి వేలుపై ఇంక్ మార్కు చేయడం, పోస్టల్ బ్యాలెట్ ఇష్యూ చేయడం తదితర అంశాలను వివరించారు. అదేవిధంగా ఫారం–13ఏ, ఫారం–13బీ, ఫారం–13సీ, ఫారం–13డీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వరుస క్రమంలో వివరించారు. ప్రతి విషయంలోనూ అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఎస్ఈఓ యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, గ్రామ వార్డు సచివాలయాల సమన్వయ అధికారి కె.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

### ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓ తప్ప తమ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వివరణ ఇస్తున్నప్పటికీ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై బురద చల్లేందుకు వివిధ అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నీతి అయోగ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై వివరణ ఇచ్చిందని, ఆ చట్టాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని సర్క్యులర్ పంపితే జగనన్న ప్రభుత్వం వ్యతిరేకిస్తుందన్నారు. అయినా దానిపై చంద్రబాబు అండ్ కో అబద్ధాలను పచ్చ పత్రికల్లో అచ్చు వేయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 8న మోదీ విజయవాడకు రానున్న నేపథ్యంలో ఆయన్ని కలిసి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై రిప్రజంటేషన్ ఇచ్చేందుకు పర్మిషన్ ఇప్పించాలని కోరుతూ చంద్రబాబుకు లేఖ పంపినట్లు వివరించారు.